క్లుప్తంగా

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా

వరికుంటపాడు: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కేజీల జీలగలు రాయితీ పోను రూ.440లకు, జనుములు రూ.440లకు, 8 కేజీల పిల్లిపెసర్లు రూ.536లకు పొందేందుకు రైతుభరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఒక ఎకరాకు ఒక సంచి చొప్పున, ఐదెకరాల వరకు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూమిలో కర్బనశాతం పెరగడంతోపాటు స్థూల, సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందేందుకు తోడ్పడుతాయని తెలిపారు.

సీతారాములకు గ్రామోత్సవం

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా శ్రీసీతారాముల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ అర్చకుడు లోకా ప్రసాద్‌శర్మ స్వామివార్లకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి ఉత్సవంగా ఊరబావి వద్దకు తీసుకెళ్లి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పార్వేట, లంకాదాహనం కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ముగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లి గ్రామంలో సీతా సమేత ప్రసన్న కోదండరామ స్వామి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ తల్లికి భక్తులు చలిపిండి, పానకాలు, చద్ది, పొంగళ్లు సమర్పించారు. మహిళలు తమ గృహాల నుంచి పొంగలి సామగ్రిని కొత్త గంపల్లో తీసుకొని తప్పెట్ల చప్పుళ్ల మధ్య పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. స్థానికులతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో పదో తరగతి చదివిన 2004–05 బ్యాచ్ విద్యార్థులు అందరూ కలుసుకుని విద్యార్థి దశలో తాము చేసిన అల్లరి, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు దివాకర్, వెంకటేశ్వర్లులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

సంగం: మండలంలోని సిద్ధీపురం గ్రామంలో యువనేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువకులు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోటివేటర్ మధు, యువనేస్తం ఫౌండేషన్ నిర్వాహకులు చంద్రకాంత్, నాయబ్ రసూల్, యువకులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ

- యువకుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న లోకేశ్

విడవలూరు : రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని వీరారెడ్డిపాళెం గ్రామం వద్ద ఆదివారం చేటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అలగానిపాడు గ్రామానికి చెందిన లోకేశ్ రామతీర్థం వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసుకుంటూ వస్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వీరారెడ్డిపాళెం వద్ద వేగంగా ఢీకొట్టారు. దీంతో లోకేశ్ కాలు విరిగింది. వెంటనే గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో లోకేశ్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

- ఎప్పుడూ ఒకే పంట సాగు చేస్తే నష్టాలు
- చీడపీడల ఉధృతి ఎక్కువ
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి
- అధిక దిగుబడులు సాధించే అవకాశం
- ఉదయగిరి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)



చెన్నారెడ్డి

ఉదయగిరి: ఒకే పొలంలో ఒకే పంటను సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గుతాయని, పంటల్లో ఎదుగుదల ఉండదని చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని, అందుకే పంటమార్పిడి పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను ఉదయగిరి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి రైతులకు వివరించారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులు సమర్థవంతంగా వాడుకోవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అత్యధిక లాభం పొందవచ్చని వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకతపై రైతులకు ప్రయోజనకరమైన సూచనలు చేశారు.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆ లోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట కూడా నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది.
- మార్కెట్ సమస్యలు ఎదురవుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతు వేర్లు ఉన్న పైర్లు తక్కువ లోతు గల పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు వరి–అపరాలు, జొన్న–పత్తి.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి. ఉదాహరణకు మొక్కజొన్న–అపరాలు

పంట మార్పిడితో లాభాలు

పంట మార్పిడి విధానం ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరిపంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయాచిక్కుడు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే సిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడుపులు మాదిరి ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు

ఉదయగిరి సబ్ డివిజన్‌లో రైతులు ఏటా ఒకే పంటను సాగు చేస్తున్నారు. నీటిపారుదల కింద ఎప్పుడూ వరిపంట తప్ప వేరే పంట సాగు చేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని నివారించుకునేందుకు పంట మార్పిడి విధానం చాలా శ్రేష్టమైంది. దీనిపై రైతులు అవగాహన పెంచుకోవాల్సి ఉంది. పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలను రైతులు ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే కొనసాగిస్తారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పంటమార్పిడి విధానంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

హుండీ కానుకల లెక్కింపునకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి భక్తులను ఆహ్వానిస్తున్నామని దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో కార్యక్రమం ఉదయం 8.30కు ప్రారంభంకానుందని వివరించారు.

శేషవాహనంపై కోదండరాముడు



కోవూరు : మండల కేంద్రమైన కోవూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు శేషవాహనంపై విహరించారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్న స్వామివారిని భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు.


పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పాండురంగ విఠలేశ్వరస్వామి

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపంలో ఉన్న పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం నారాయణప్పపేట, పాండురంగాపురం, సంగసానిపల్లి, రాజుగారి, ఏనుగులవారి, లకం వారి, నూతివారి కొట్టాల ప్రజలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం సీతారామపురం కోటవీధి ప్రజలు అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాశీనాయన ఆశ్రమ నిర్వాహకురాలు శివమ్మ భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సోమవారం హనుమంతుసేవ నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

శ్యాంసుందరనాయుడు మృతి తీరనిలోటు



గొట్టిపాటి శ్యాంసుందర నాయుడు (ఫైల్)

జలదంకి: కావలి మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గొట్టిపాటి శ్యాంసుందరనాయుడు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం గొట్టిపాటి శ్యాంసుందరనాయుడు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. శ్యాంసుందరనాయుడు మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. ఆయన మరణవార్త తనను ఎంతో కలచివేసిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అలాగే శ్యాంసుందరనాయుడు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కమ్మవారిపాళెం, కేశవరం సర్పంచ్‌లు తమ్మినేని సతీష్‌నాయుడు, రావి ప్రసాద్‌నాయుడు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

పేదలపాలిట పెన్నిధి సుందరయ్య



సోమశిల: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన పుచ్చలపల్లి సుందరయ్య పేదలపాలిట పెన్నిధి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ శివప్రసాద్, సీపీఎం కార్యదర్శి డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, ఆళ్ల హజరత్తయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో..

సోమశిల: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రం అనంతసాగరంలోని తాజ్‌కేఫ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బరాయుడు, మంగళ పుల్లయ్య, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

ఉదయగిరి: కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఫరిద్దీన్‌బాషా, బండగానిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య, దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, రంతుజానీ, శ్యామ్‌ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఎం భవన్‌లో..

మర్రిపాడు: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రం మర్రిపాడులోని సీపీఎం భవన్‌లో ఆదివారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ఐద్వా, సీఐటీయూ నాయకులు సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మూలి వెంగయ్య, తిరుపతి, షేక్ ఇమామ్ ఖాసీం, సూర్యనారాయణ, ఖాజారసూల్, ఖాజావలి, మూలి ప్రమీల, సయ్యద్ ఖాసింబీ, షేక్ మున్ని పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



అనుమసముద్రంపేట: త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రదర్శిస్తున్న సేవా సమితి సభ్యులు



వరికుంటపాడు: త్రైత సిద్ధాంతం గురించి ప్రచారం చేస్తున్న సభ్యులు

వరికుంటపాడు: ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలో ఆదివారం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు శాఖ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, నాగమ్మ, రమణయ్య, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట మండలంలో..

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన, కొత్తకోట, కాకర్లపాడు, చందులూరుపాడు, గుంపర్లపాడు గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పాదలకూరు కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు జి.పెంచలనరసయ్య, కె.గోపి, కె.కార్తీక్, టి.అభినయ, బి.కిరణ్, ఎంసీ సుధాకరాచారి, కె.హరిప్రసాద్, వై.పెంచలయ్య, వై.మాళవిక, ఇ.పద్మమ్మ, ఇ.శేషాద్రి, బి.కృష్ణయ్య, ఎం.కొండయ్య, పి.మధు, పి.జాహ్నవి, టి.నర్సారెడ్డి, భాగ్యమ్మ, టి.హరి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మండల వాసులు రాత్రంతా కరెంటు లేక ఇబ్బందులు పడ్డారు. అలాగే ఆదివారం కూడా అకాలవర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కేన్సర్‌పై వాకర్స్‌కు అవగాహన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు అవగాహన సదస్సును స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేన్సర్‌పై అపోలో హాస్పిటల్ వైద్యులు హరిత అవగాహన కల్పించారు. డాక్టర్ సత్యనాథ్, అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కార్యదర్శి గుర్రం వెంకటసురేంద్రబాబు, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, కోశాధికారి అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం



పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు నీతి కథల గురించి వివరించి వారితో కథల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి యోగా క్లాసులు నిర్వహించారు.

సింహ వాహనంపై ప్రసన్న విశ్వేశ్వరుడు



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు గ్రామంలో కొలువైన శ్రీఅన్నపూర్ణాంబ సమేత ప్రసన్నవిశ్వేశ్వరుని దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని సింహ వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి గ్రామస్తులు కొబ్బరికాయ కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు బందారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సరేంద్రబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్డన్ సెర్చ్



ఉదయగిరి: స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు



వింజమూరు మండలం బత్తినవారిపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఉదయగిరి: పట్టణంలో ఆదివారం సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పట్టణంలోని ఇందిరానగర్, ఎస్సీకాలనీ, శ్రీనగర్‌కాలనీ, సినిమాహాలుసెంటర్ తదితర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి 28 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ధ్రువీకరణ పత్రాలు చూపిన 20 మంది వాహనదారులకు వారి వాహనాలను తిరిగి స్వాధీనం చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, తిరుపతయ్య, ఉమాశంకర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

కప్పరాళ్లతిప్పలో..

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు కావలి రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో కావలి రూరల్, అల్లూరు, దగదర్తి పోలీసులు తిప్పలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పాతనేరస్తులు, అనుమానితులు, స్థానికేతరుల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ నాగభూషణం మాట్లాడుతూ పోలింగ్ తరువాత కూడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకోవడం, కౌంటింగ్ రోజున అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. అల్లూరు, దగదర్తి ఎస్సైలు శ్రీనివాసులురెడ్డి, మర్రినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బత్తినవారిపల్లిలో ఆదివారం తెల్లవారుజామున కలిగిరి సీఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ ముగియడం, కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వింజమూరు ఎస్సై కోటిరెడ్డి, కలిగిరి, కొండాపురం, జలదంకి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి

మనుబోలు : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో ఏకాదశి పూజలను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ జరిపించి వేద మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.